క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మోటార్ సైకిళ్లను పరిశీలిస్తున్న సీఐ

దొర్నిపాడు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లెలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానిత ఇళ్లలో సోదాలు జరిపారు. ఇళ్లలో మారణాయుధాలు కల్గి ఉండరాదని హెచ్చరించారు. ఒక వేళ ఉంటే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలన్నారు. సైబర్ క్రైంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఆధార్, బ్యాంకు వివరాలను ఇవ్వరాదన్నారు. రికార్డులు సరిగ్గాలేని 3 ట్రాక్టర్లు, 5 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. అలాగే మరో 19 మోటార్ సైకిళ్లపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జయప్ప, నగీన, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీఐ

శిరివెళ్ల: బాలికలు, మహిళలు తమ రక్షణకు శక్తి మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ దస్తగిరి బాబు అన్నారు. శనివారం యర్రగుంట్ల విమలా ఇంగ్లిష్ ఉన్నత పాఠశాలలో రహదారి నియమాలు, మత్తు పదార్థాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రహదారులపై ప్రయాణం చేసే టప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిర పడిన తర్వాతే వివాహాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం సరికాదు



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులపై బోధనేతర కార్యక్రమాల పని భారం తగ్గించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ మాట్లాడుతూ బదిలీలు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీల సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, రామకృష్ణుడు, కాశీం, నరసింహారెడ్డి, అరవిందకుమార్, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రుణాలు

శిరివెళ్ల: డ్వాక్రా సంఘాలకు భారీగా రుణాలు పంపిణీ చేస్తున్నట్లు వెలుగు ఏపీఎం రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ ఈ ఏడాది రూ. 50 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు పంపిణీ చేయాల్సి ఉండంగా ఇంత వరకు 134 సంఘాలకు రూ. 18 కోట్ల రుణాలను పంపిణీ చేశామన్నారు. ఉన్నతి కింద ఎస్సీ, ఎస్టీలకు రూ. 40 లక్షలను పంపిణీ చేయాలన్నది లక్ష్యమన్నారు. చెంచులకు రూ. 10 లక్షలు రుణాలు పంపిణీ చేస్తామన్నారు. సీనియార్టీ ఆధారంగా ఒక్కో సంఘానికి రూ. 20 లక్షలు నుంచి 30 లక్షలు వరకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. మండలంలో వంద శాతం రికవరి ఉందన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నంద్యాల: పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో పేకాటరాయుళ్లను అరెస్ట చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఎన్‌జీఓస్ కాలనీలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,700 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, డోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి, కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ గీతా పాల్గొన్నారు. ఈ ఎంపిక పోటీలకు 150 మంది బాలబాలికలు హాజరయ్యారు. క్రీడా మైదానంలో విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఎంపిక ప్రక్రియకు అబ్జర్వర్ నాగరాజు, నంద్యాల జిల్లా సెక్రటరీ పరమేశ్వరరెడ్డి, పీడీలు నాగమణి, జరీనా, హర్ష, ఓబులేసు, చౌడయ్య, సుధీర్, రాహుల్, వెంకటేష్, జానీ పాల్గొన్నారు.

సమస్యల దరువు

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు ఏకరువు పెడుతున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ హాస్టళ్లపై దృష్టి సారించ లేదు. దీంతో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాలు మొదలు ఆకలి దప్పుల వరకు అవస్థలే. ఇటీవలే సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినా సర్కారులో మార్పు రాలేదు. ఏ హాస్టల్ చూసినా అధ్వానంగానే ఉంది. ఆళ్లగడ్డ, నియోజకవర్గంలోని హాస్టళ్లలో వసతులపై సాక్షి బృందం విజిట్ నిర్వహించగా పలు సమస్యలు వెలుగుచూశాయి. పెచ్చులూడుతున్న పైకప్పులు, నెర్రెలు పోయిన గచ్చులు.. సగం విరిగిన తలుపులు, ధ్వంసమైన కిటికీలు, చాలాచోట్ల కానరాని ప్రహరీలు, నీటి సదుపాయం లేని మరుగుదొడ్లు, బాత్‌రూంలు, రాత్రిపూట వేధిస్తున్న దోమలు ఇలా పలు అవస్థల మధ్య విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్న దృశ్యాలు కనిపించాయి. – ఆళ్లగడ్డ

చాగమర్రిలోని బాలికల వసతి గృహంలో ఆరుబయటే భోజనాలు



- సంక్షేమ వసతి గృహాల్లో కానరాని సౌకర్యాలు
- శిథిలావస్థకు చేరిన పలు భవనాలు
- విరిగిన తలుపులు, కిటికీలు
- మరుగుదొడ్లకు పరదాలు
- పనిచేయని తాగునీటి మోటర్లు
- మంచాల్లేక విద్యార్థులు కటిక నేలపై నిద్ర

నియోజకవర్గంలో వసతి గృహాలు, విద్యార్థుల సంఖ్య

మండలం	ఎస్సీ	విద్యార్థులు	బీసీ	విద్యార్థులు
ఆళ్లగడ్డ	1	120	3	220
చాగలమర్రి	1	100	1	85
శిరివెళ్ల	1	100		
ఉయ్యాలవాడ	1	94	1	70
	4	414	5	375



యర్రగుంట్లలో విద్యుత్ సౌకర్యం లేని మరుగుదొడ్లు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకు ఏ ఒక్క వసతి గృహంపై దృష్టి సారించలేదు. దీంతో వాటిలో చదువుకుంటున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి సెలవుల్లో వసతిగృహాలను మరమ్మతులు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడం.. నిర్వహణను గాలికొదిలేయడంతో అవి దారుణంగా మారాయి. నిరుపేద విద్యార్థులు కిటికీలకు తలుపులు లేక మెస్‌లు ఏర్పాటు చేయక దోమలతో కుస్తీ పట్టాల్సి వస్తోంది. విద్యార్థులు నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. పలు చోట్ల గచ్చులు ధ్వంసం కావడంతో ఆరుబయట నిద్రించాల్సిన పరిస్థితి. స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోవడంతో ఒకటికి రెండుకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

చాగలమర్రిలో..

మండల కేంద్రం చాగలమర్రిలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో సుమారు 85 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికి 8 గదులున్నాయి. వసతి గృహంలో16 మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నప్పటికీ కొన్నింటికి వాకిళ్లు లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి. అదే విధంగా వసతి గృహ సముదాయంలోని గదుల కిటికీలకు ఉన్న దోమల నివారణకు ఏర్పాటు చేసిన మాస్కిటో తెరలు తొలగిపోయాయి. పలు కిటికీల, గదుల వాకిళ్లు దెబ్బతిన్నాయి. విద్యార్థినులు ఏలాగోలా విద్యాభ్యాసం పూర్తి చేసుకోవాలనే ఉద్దేశంతో సర్దుబాటు చేసుకుంటున్నారు. అంతేకాకుండ వంట గది పక్కనే ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద నిర్మించిన ప్లాట్‌ఫాం దెబ్బతినింది. దీంతో భోజన అనంతరం విద్యార్థినులు చేతులు, ప్లేట్లు శుభ్ర పరచుకోవటానికి ఇబ్బందికరంగా ఉంది. అలాగే గదుల పైకప్పు పెచ్చులుడుతున్నాయి.

శిరివెళ్లలో..

మండలంలోని యర్రగుంట్లలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 100 విద్యార్థులు ఉన్నారు. పూర్తి స్థాయిలో ప్రహరీ లేదు. ఉన్న మరుగుదొడ్లకు విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో పాటు విద్యార్థులు రాత్రివేళ కప్పుకోవడానికి దుప్పట్లు రాకపోవడంతో గతేడాది ఇచ్చిన వాటినే వినియోగించుకుంటున్నారు. ఈ ఏడాది నూతనంగా చేరిన విద్యార్థులు ఇళ్లవద్ద నుంచి దుప్పట్లను తెచ్చుకున్నారు.

దొర్నిపాడులో ..

స్థానిక ఎస్సీ బాలు వసతి గృహంలో 95 మంది విద్యార్థులు ఉన్నారు. కిటికీలకు మెస్ లేక పోవడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో దోమల తాకిడికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక విద్యార్థులు నేలపైనే నిద్రకు ఉపక్రమిస్తుండడంతో పాటు డైనింగ్ హాల్ మరమ్మతులు చేస్తుండటంతో ఆరుబయట భోజనాలు చేయాల్సి వస్తుంది.

ఉయ్యాలవాడలో

మండలకేంద్రం ఉయ్యాలవాడలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 94 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవలే రూ.29 లక్షలతో వసతి గృహాన్ని రీ మోడలింగ్ చేయడంతో మౌళిక వసతుల కొరత లేదు. కానీ విద్యార్థులు మాత్రం నేలపైనే నిద్రపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి మంచాలు రాలేదు.



ఉయ్యాలవాడలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు



కిటికీలకు తలుపులు లేని దృశ్యం



గదుల వాకిళ్లు దెబ్బతిన్న దృశ్యం



చాగలమర్రి బీసీ బాలికల వసతి గృహంలో పై కప్పు దెబ్బతిన్న దృశ్యం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్. జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కెవీధిలో వెలసిన నాగలింగేశ్వర ఆలయంలో శ్రీఅభయాంజనేయ స్వామికి శ్రావణమాసం మొదటి శనివారం పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

శ్మశాన స్థలం పరిశీలన



ముస్లింల శ్మశాన వాటికను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ : మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో ముస్లింలు, నూర్‌బాషాలకు సంబంధించిన శ్మశాన వాటిక స్థలాన్ని తహసీల్దార్ సువర్ణాదేవి శనివారం పరిశీలించారు. ఈ నెల 14వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పై గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు శ్మశాన వాటిక స్థలం తనదని, మృతి చెందిన శవాలను పూడ్చేందుకు వీలు లేదని అడ్డుకున్నారని ముస్లిం మైనారిటీలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్ఓ వెంకటేశ్వరరెడ్డిలు వివాద స్థలాన్ని పరిశీలన చేశారు. 145–3 సర్వే నంబర్‌లో 83 సెంట్లు భూమి శ్మశాన వాటిక కింద అనుభవంలో ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా వెల్లడైంది. అభ్యంతరం తెలిపిన రైతు వెంకటేశ్వర్లుతో కూడా మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. కొలతలు వేసి ఎవ్వరికి ఇబ్బంది లేకుండా చూస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి



శిరివెళ్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



అవార్డు అందుకున్న కాంతారావు

నంద్యాల(న్యూటౌన్): దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని టూటౌన్ సీఐ ఇస్మాయిల్ అన్నారు. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా టూటౌన్ సీఐ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని దేశానికి ఉపయోగపడాలన్నారు. మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎంతో మంది సైనికులు దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్‌లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు కమాల్‌ఖాన్, కేర్ టేకర్, లక్ష్మీదుర్గా, డాక్టర్ లలితాసరస్వతి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు, సీఎస్‌ఐ చర్చి పాస్టరేట్ చైర్మన్ కాంతారావును సన్మానించారు. కర్నూలులోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ సైన్యాన్ని ఓడించి మన ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

శిరివెళ్ల: దేశ రక్షణకు సైనికులు చేస్తున్న త్యాగాలు మరువలేనివని అపుస్మా ఆళ్లగడ్డ నియోజక వర్గ అధక్షుడు అమీర్‌బాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలో అపుస్మా నియోజక వర్గ యూనిట్ ఆధ్వర్యంలో ఇక్రా పాఠశాల విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల త్యాగాలు, ధైర్య సాహసాలు, వారి దేశ భక్తి మనకు స్ఫూర్తి దాయకమన్నారు. 1999లో ఇండియా– పాకిస్థాన్ కార్గిల్ యుద్ధంలో 527 మంది సైనికులు అమరులయ్యారన్నారు. యుద్ధంలో ఇండియా విజయం సాధించినందుకు ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు.

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల జిల్లా మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగనాయకులు, ఇటీవల ఆపరేషన్ సింధూరులో పనిచేసిన వై.శ్రీనివాసులును సత్కరించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం స్థానిక కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, సభ్యులు ఏవీఆర్ ప్రసాద్, డాక్టర్ రావికృష్ణ, అమిదేల జనార్ధన్, రవి ప్రకాష్, పీవీ సుధాకర్ రెడ్డి, నిజాముద్దీన్, ఆంజనేయులు గుప్తా, భవిరిశెట్టి శ్రీకాంత్, రమణయ్య, చంద్రమోహన్, పోసిన సుబ్బారావు, యూసుఫ్, రామయ్య పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం



మాట్లాడుతున్న స్వప్న ప్రియదర్శిని

నంద్యాల(అర్బన్): మానవ అక్రమ రవాణా జరగకుండా కలిసికట్టుగా అడ్డుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని తెలిపారు. ప్రత్యేకంగా పిల్లల అక్రమ రవాణాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శనివారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతుందని తెలిసినట్లు అయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కి సమాచారం ఇస్తే సంబంధిత శాఖల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రైల్వే పోలీసు అధికారిణి కుమారి, కృష్ణయ్య యాదవ్, సంపత్, రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

స్పిల్ వే నుంచి నీరు విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోని స్పిల్ వే నుంచి నాలుగు గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని శనివారం దిగువకు విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 11 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు 10 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 15.234 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు.

'హరిహర వీరమల్లు' ముస్లింల మనోభావాలను గాయపరిచింది



మాట్లాడుతున్న యూనిస్

నంద్యాల(అర్బన్): పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ముస్లింల మనోభావాలను కించపరచడానికి తీసినట్లుగా ఉందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ ఆరోపించారు. పూర్తి అవాస్తవ కల్పనలతో ఈ చిత్రాన్ని తీసి చారిత్రాత్మక కథాంశంతో నిర్మించామని పవన్ కల్యాణ్ చెప్పడం దుర్మార్గమన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్యనాయకులతో కలిసి మాట్లాడారు. మైనార్టీలను కించపరుస్తూ సనాతన ధర్మం అని మాట్లాడటం ఎంత వరకు సబబు అన్నారు. వ్యాపారంలా మారిన సినిమాలో ఇతర మతాలను కించపరచడం బాధాకరమన్నారు. అలాంటి సీన్‌లను సెన్సార్ బోర్డు అధికారులు తొలగించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



అహోబిలంలో సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దగాపై నిలదీయండి

- ఓట్ల కోసమే ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో హామీలు
- ఏడాది గడిచినా అమలు ఊసే లేదు
- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి
- రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన

ఆళ్లగడ్డ: సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు నమ్మించి చేసిన మోసంపై అధికార పార్టీ నాయకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. రీకాలింగ్ చంద్రబాబూస్ మేని ఫెస్టో కార్యక్రమానికి నియోజకవర్గంలో అపూర్వ స్పందన లభిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమకు చాలా మేలు జరిగిందని, కూటమి సర్కారు పాలనలో ఒక్క రూపాయి లబ్ధి కూడా జరగలేదని ఆళ్లగడ్డ మండలం అహోబిలం, కోట కందుకూరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఇంటింటికి బాబు మోసాలు కార్యక్రమంలో ప్రజలు ఏకరువు పెట్టారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొశెట్టి నాగేశ్వర్‌రావు, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి తదితర పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను వివరించారు. పార్టీలకు అతీతంగా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గతంలో మేము టీడీపీ అయినా ఏమాత్రం సిఫార్సులు లేకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే వచ్చి అందించారని మళ్లీ ఆరోజులు రావాలని కోరుకుంటున్నామని వెల్లడించడం గమనార్హం. అనంతరం గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు బహిరంగ సమావేశాల్లో మాట్లాడుతూ జగన్ అమలు చేస్తున్న అన్ని సంక్షేమపథకాలను కొనసాగించడంతో పాటు అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం గతంలో ఎలా మోసం చేశారో అలాగే మరోసారి అన్ని వర్గాల ప్రజలను దగా చేశారన్నారు. 2019 – 24 మధ్య వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. నేడు సంక్షేమ పథకాలు అందక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి బాండ్లు పంచిపెడుతూ హామీలు అమలు చేయకపోతే తమ కాలర్ పట్టుకొని అడగాలన్నారు. ఇప్పుడు వారు గ్రామాల్లో తిరిగితే ప్రజలు అదే పని చేస్తారన్నారు. ఈ ఏడాదిలో మీరు ఎంత నష్టపోయారో, ప్రభుత్వం మీకు ఎంత బాకీ ఉందో చూసుకుని మా బాకీ ఎప్పుడిస్తారు అని నిలదీయడం మీ హక్కు అని అన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను మీకందరికీ గుర్తు చేయడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయంతం చేద్దామని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఎల్లకాలం తెలుగుదేశం అధికారంలో ఉండదని స్థానిక ఆపార్టీ నాయకులు, అధికారులు గుర్తు పెట్టుకోవాలన్నారు. మా మనుషులను మూడు నెలలు గ్రామం వదిలిపోయేలా చేస్తే మేం అధికారంలోకి వస్తే మూడేళ్లు గ్రామంలో ఉండకుండా చేయగలమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెదిరింపులకు బయపడే వారు కాదన్నారు. అధికారంలోకి వచ్చాక మేము వడ్డీతో సహా తీర్చుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పలసాని మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, కొలిమి దాదాపీర్, సర్పంచులు నాసారి వీరమ్మ, లక్ష్మీదేవి, రామకృష్ణ, కొలిమి బాషా, వెంకటసుబ్బయ్య, మధు, నాగేషుడు, నాగార్జునరెడ్డి తదితరులున్నారు

కారు ఢీ కొని వృద్ధురాలు మృతి

శిరివెళ్ల: నంద్యాల– ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై సందు ఫుడ్ కోర్ట్ వద్ద శనివారం కారు ఢీ కొని గోవిందపల్లెకు చెందిన నెట్టూరి వెంకటమ్మ (65) మృతి చెందింది. వృద్ధురాలు ఫుడ్ కోర్టులో పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డు పక్కన కుర్చోంది. నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న కారు వేగంగా వృద్ధురాలిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడి కక్కడే మృతి చెందింది. ఈమేరకు కుమారుడు హనుమంతు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏపీ ప్రాజెక్టులపై తెలంగాణ పెత్తనాన్ని తగ్గించాలి

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులపై తెలంగాణ పెత్తనాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ అతిపురాతనమైన కేసీ కెనాల్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 39.9 టీఎంసీల నీటి వాటాను 18.51 టీఎంసీలకు తగ్గించి ఆదా అయిన నీటిని తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ఎదుట వాదన వినిపించడం దారుణమన్నారు. ఏపీలోని అన్ని ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం అదే తరహా వాదనలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త టరమ్స్ ఆఫ్ రెఫరెన్స్ వల్ల ఇటువంటి అసంబద్ధమైన వాదనలను తెలంగాణ ప్రభుత్వం చేయడానికి అవకాశం వచ్చిందన్నారు. కేసీ కెనాల్‌కు నీటి వాట తగ్గించడంతో ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర విభజన అంశాలను పూర్తి చేసి రెండు రాష్ట్రాల మధ్య సఖ్యత ఏర్పాటు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. దీనిపై ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రజలు మేల్కోవాల్సిన తరుణం ఆసన్నమైందని, మన నీటి హక్కులపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించేలా ఒత్తిడి పెంచాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

దొర్నిపాడు: పిల్లలకు అవసమైన పోషకాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. శనివారం క్రిష్టిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో ఈసీసీఈ డే‌ను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు.